కథ:

# మమకారం

'ఆ పిల్లాడంటే మా పెద్దాడబడుచుకి ఎక్కడలేని అభిమానం' అంటుంది నా చిన్నమరదలు.

'ఆ రాజిగాడంటే ఎందుకమ్మా అంత పేక్షనీకూ' దీర్ఘాలుతీస్తుంది పక్కింటిపిన్ని. 'అమ్మమ్మా, నీకు ఆ రాజిగాడంటేనే ఇష్టంకదూ, నరేలేవే' బుంగమూతి పెడుతుంది నా బుల్లిమనుమరాలు మీన.

'కూతురుకొడుకంటే ఎంతమమకారమే నీకు' నవ్వుతాడు మా పెద్దబ్బాయ్.

పైకిమాత్రం 'అందరూ నాకొకటే' అంటాగానీ, నిజంగా రాజిగాడంటే నాకెంతో అభిమానం. అందరిలోకీ అందమైనవాడు, బుద్ధిమంతుడు వాడేనని నా నమ్మకం. వాడంటే నాకెక్కడలేని మమకారం - ఎందుకోమరి ?

* * *

పెద్దమ్మాయి ఉత్తరంచూస్తే నవ్వొచ్చిందినాకు. 'ఎందుకే అమ్మమ్మా, నవ్వుతున్నావ్' అన్నాడు రాజిగాడు నా చేతిలో ఉత్తరంలాక్కుని.

'నీ చదువిక్కడ బాగాసాగటంలేదుట, మీఅమ్మ నిన్ను తీసుకుపోవాలనుకుంటోందిలే... కానీ నేనుపంపుతానాఏమిటీ' అన్నాను వాడినిచూస్తూ. 'అచ్చా- నేవెళ్ళిపోతానైతే' ఎగిరి గంతేసాడు రాజిగాడు. అంతే నా కళ్ళలోనీళ్ళు తిరిగాయి. 'నువ్వెళ్ళిపోతావా రాజూ.'

'నేవెళ్ళనే, ఊరికేఅన్నా.' అన్నాడు రాజిగాడు నాకళ్ళల్లోకిచూస్తూ. నా కళ్ళ నీళ్ళు జలజలారాలాయి. 'బాబూ, నువ్వు కూడా వెళ్ళిపోతే నేఒక్కర్తినీ ఎలా వుంటాను చెప్పు. మీ అమ్మేమో నన్నువదలి దూరం వెళ్ళిపోయింది. పిన్ని ఇంక నాలుగురోజుల్లో బొంబాయి వెళ్ళిపోతుంది. మామయ్య చదువుకోసం నన్నొదిలి వెళ్ళిపోయాడు. నువ్వుకూడా ఈ ముసలి అమ్మమ్మని ఒక్కర్తినీ ఒదిలి వెళ్ళిపోతావా,' నాగొంతు వణికింది. రాజిగాడిని దగ్గరగా తీసుకు ముద్దుపెట్టుకున్నాను.

నేనుమాత్రం పంపనుగా, నాకొక్కర్తికీ ఏం తోస్తుంది.నకా' మెట్లమీద నుంచున్న పిన్నిగారితో అన్నాను, ఆవిడ పకపకన నవ్వింది. 'బాగుందమ్మా, వాళ్ళబ్బాయిని వాళ్ళుపంపమంటే నీ అడ్డేమిటి మధ్య, ఎవరైనా వింటే నవ్విపోగలరు !' అంటపిన్న. నా ఒళ్ళు మండిపోయింది. 'నవ్వితే నవ్వనీ, ఏడిస్తే ఏడవనీ, నాకేం, నా మనుమణ్ణి నేనెలాగూపంపను' అన్నాను, పిన్నితో ఏదో దెబ్బలాడుతున్నట్లు.

రచన

'శ్రీమతి ముక్తేవి భారతీదేవి

నిజంగా వాడంటే విడదీయరాని అనుబంధం నాలో ఏర్పడిపోయింది. ఆ వాత్సల్యం తీగలుసాగి పూలు పూస్తోంది.' తొమ్మిదేళ్ళనుండి నాదగ్గిరవుంటూ, ఒక్కనాడైనా నన్ను విడిచిపెట్టనిరాజు, ఆరోజు నన్నుఒదిలి, తనపుస్తకాల బీరువాను ఒదలి, అన్నీ మరిచిపోయి, రాగవల్లరిని త్రెంపి పారేసుకుని, అమ్మదగ్గిరికి పరుగెడతాడంటే నా హృదయం బద్దలవదూ !

* * *

ఆ రోజు సోమవారం 10 గం॥ లయ్యేసరికి అమ్మాయి మరిది వచ్చాడు ఊరునుంచి. 'రాజిగాణ్ని తీసుకురమ్మంది ఒదిన' అన్నాడు గడపలో కాలుపెడుతూనే. నా ఒళ్ళు మండింది. "వాడు రాడని చెప్పు" అన్నాను. "వెంటనే తీసుకురమ్మంది. లేకపోతే ఈ ఏడు చదువు కుదరదు. సీటుండదు తర్వాతయితే" అన్నాడు బూటు తాడిప్పుతూ. "మరేం నష్టం లేదులే, వాడికి చదువక్కర్లేదన్నానని చెప్పు. వాడిని పంపనన్నానని చెప్పు. వెళ్లిపో, ఈ బండికే వెళ్లిపో నువ్వు" అన్నాను కసిగా. ఆ అబ్బాయి నవ్వాడు, "అందుకే అంటారు కన్నప్రేమకన్నా పెంచిన ప్రేమ ఎక్కువని, వాణ్ణెలాగూ నే తీసుకువెడతా !" కోపంతో మూతి మూడు వంకరలు తిప్పా.

రాజిగాడు బడినుంచి పరుగెత్తుకొచ్చాడు వాడ్ని చూసేసరికి నాకెంతో దుఃఖం వచ్చింది. "నే వీడ్నిపంపను," వాడ్ని ఒళ్ళోకూచోపెట్టుకున్నా.

తరువాత ఆలోచించాను. నాకే నవ్వు వచ్చింది. వాళ్ళమ్మ పంపమంటే పంపననడమేమిటి? పాపం దానికిమాత్రం పిల్లాడు దగ్గిరుండాలని ఉండదూ ! వాడిమీదున్న ప్రేమకొద్దీ నాకలా అనిపిస్తుంది గాని. చిన్నప్పుడు మామయ్య నన్నెంత బ్రతిమలాడినా రెండురోజు లుండటానికి ఎంత ఏడ్చేదానినో. అమ్మదగ్గిరకు పోతానని. పాపం, రాజు బంగారు తండ్రి కనుక ఈ అమమ్మ దగ్గరున్నాడు. వాడికి నేనంటే ఎంతోప్రేమ నాకళ్ళు నీళ్ళతో నిండాయి. ఏమయినా సరే, వాడ్ని పంపను. వాణ్ని పంపి నేఒక్కర్తినీ ఉండలేను బాబూ, రాజి నాక్కావాలి" నా గొంతు గాద్గదికమైంది. అప్పుడే రాజిగాడు సంచి బుజాన వేసుకు వచ్చాడు. "అమ్మమ్మా, నే బడికి పోతున్నా" అన్నాడు.

"ఒద్దులేరా వెధవ బడి" అంటూ వాడిని చూస్తూ కూర్చున్నా. నా మనసులో ఎంత బెంగవుందో ఆ చిన్నారి హృదయం గ్రహించింది. 'అలా వున్నావేం, కోపమా నా మీద అమ్మమ్మా' అన్నాడు వాడు "నీ మీద కాదు, మీ అమ్మమీద... మరి నువ్వు వెళ్ళిపోతావా ఐతే" అన్నాను వాడి జుట్టు ఆప్యాయంగా నిమురుతూ.

రాజిగాడికి వాళ్లమ్మ, వాళ్లఊరు గుర్తొచ్చాయి ఒక్కసారి. వాళ్ల చిన్న బంగాళా, ఆ బంగళాలో పెద్దబాదం చెట్టు అబ్బ, ఆ బాదంచెట్టు నిండా ఎన్ని పళ్లో... రాజుగాడి నోరూరింది. తన్నొక్కసారి వెళ్ళాడంతే

అమ్మ ఊరు. ఆ వారంలో అమ్మమ్మ మూడు ఉత్తరాలు రాసింది రమ్మంటూ. రాజిగాడికి చెల్లాయి కళ్ళకి కట్టినట్లయింది. అది బలే అల్లరి పిల్ల. వచ్చీరాని మాటలతో "అన్నయ్యా, అమమ్మకి నువ్వంతే యిత్తం. అందుకేగా మరి అన్ని బిల్లలిచ్చింది నీకూ" బుంగమూతి పెడుతుంది చిన్న చెల్లాయి మీద. అమ్మ ఎంతో మంచిది. అమ్మకి నేనంటే ఎంతిష్టమో సంతోషంతో కళ్ళుమెరిసిపోయాయి. నే వెళ్ళినప్పుడు చాలా కొత్త చొక్కాలు కుట్టించింది అమ్మ. ఎన్నో చాక్లెట్లు ఇచ్చింది. అమ్మ బలేమంచిది. 'అక్కడే వుండిపోవూ బుజ్జీ' అమ్మ గట్టిగా ముద్దు పెట్టుకు ఏడ్చింది. నే వచ్చేరోజూమా అమ్మ రాజిగాడికి అమ్మదగ్గరకు పరుగెత్తి పోవాలనిపించింది. "అమ్మమ్మా నేను మా అమ్మదగ్గరకెళ్ళిపోతా" నెమ్మదిగా తలెత్తి అన్నాడు.

నా కెంతో కోపం వచ్చింది ఆ చిన్న వెధవ మీద. "వెళ్ళు... ఇప్పుడే వెళ్ళిపో ఊ వెళ్ళు... అందరూ వెళ్ళిపోండి. నేనొక్కణ్ణినీ ఇక్కడే వుంటాలె.... నువ్వు కూడా వెళ్ళిపో, నాకు మీ మీద ఈ సుమకారమే కానీ, మీ కెల్లాగూ లేదు, అయ్యో, అమ్మ ఏం బాధపడుతుందో అని దానికీ లేదు, వెళ్లిపోతే అమ్మమ్మ ఏడుస్తుందేమోనని నీకూ లేదు. నేను ఓ గడ్డిపోచకిందలెక్క మీకు ...వెళ్ళిపో అయితే" గట్టిగా కసిరాను రాజిగాడిని. పాపం వాడు బిక్క మొఖం వేసుకు నన్ను చూస్తో కూచున్నాడు. అంతలోకే నాకెంతో జాలేసింది. ఆ కుఱ్ఱవాణ్ణి అలా కేకలేసానేమిటనిపించింది ఎంతో ఏడు పొచ్చింది. "నేను వీణ్ణొదిలి ఉండలేను" అనిపించింది. రాజిగాణ్ణి పడుకోబెట్టుకుని నెమ్మదిగా అన్నాను, "బుజ్జీ, నువ్వు కూడా వెళ్ళిపోతే నే ఒక్కణ్ణినీ ఎలా వుంటాను? నువ్వు ఊరుపోతే కొట్టుకుపోయి సరుకు లెవరు తెస్తారు. నీ ముసలమ్మకి జ్వరంవస్తే మందెవరు తెస్తారు. మందు తాగకపోతే అమ్మమ్మ చచ్చిపోదూ! నువ్వే చెప్పు. నా బంగారు తండ్రీ, ఇక్కడే వుండిపోతావుకదూ, నన్నొక్కణ్ణినీ ఒదిలి వెళ్ళిపోకేం" నా కన్నీళ్ళు జలజలా రాలాయి. "నే నెక్కడికీ వెళ్లనమ్మా, ఏడవకే" నన్ను పెనవేసుకుపోయాడు రాజిగాడు.

అమ్మని ఒదలలేక, అమ్మని చూడకుండా ఉండలేక, సతమతమవుతున్నాడు వాడు. పాపం, అమ్మమ్మ దగ్గరే వుంటాను" అనుకుంటాడు. మళ్ళీ "అమ్మని చూదొద్దూ" అనిపిస్తుంది వాడికి.

*　　*　　*

రాజిగాడి ప్రయాణం నిశ్చయమైపోయింది. నా హృదయం రాయి చేసుకు ఊరుకున్నాను. "ఈ కొంచం వేసుకో ఇంకా వేశుందిగా" అన్నాను అన్నం వడ్డిస్తూ 'అబ్బ, నాకొద్దే', అన్నాడు రాజి. ఏమీ అనకుండానే లేచాడు నాకు తెలుసు వాడికి లోపల ఎంత బెంగగా వుందో. వాడి బట్టలు, పుస్తకాలు, బొమ్మలూ అన్నీ ఒక్కొక్కటే వాడి బాబాయి సర్దుతూంటే, ఇల్లంతా ఎంతో శూన్యంగా కనిపించి, నాహృదయంవెయ్యి వ్రక్కలైపోయింది. వాడి పుస్తకాల బీరువా అంతా ఖాళీ అయిపోయి నన్ను చూచి వెక్కిరించినట్లనిపించింది. బరువుగా నిట్టూర్చానంతే- నేను చేయగలిగిందేముంది కనుక!

"బాబుగారూ రండి" రిక్షావాడి కేక వినిపించింది. రాజిగాడికి దుఃఖం పొంగుకొచ్చింది, ఎలాగో ఆపుకుని, నా కాళ్లకి దణ్ణం పెట్టాలని ఒంగాడు నాలుగైదులు వాడిజేబులో పెట్టాను. నా నోట మాట రాలేదు. "బంగారులా చదువుకుని, బుద్ధిమంతుడవు" నా గొంతు ఏణికింది. ఇంకా ఏదో చెప్పాలనిపించింది, కానీ చెప్పలేకపోయాను.

రెండడుగులు వేసి, రాజిగాడు వెనక్కు వచ్చి, నన్ను కావలించుకుని "నేవెళ్ళనమ్మమ్మా" అన్నాడు బిగ్గరగా ఏడుస్తు, నా హృదయం ద్రవించిపోయింది. కళ్ళనీళ్ళు ముత్యాల్లా బుగ్గలమీదుగా జారిపోయాయి. "లేదు, వెళ్ళిపోబాబూ ... మీ అమ్మదగ్గిరకెళ్ళిపో, నా బంగారు తండ్రీ! అమ్మనీకోసం బెంగపెట్టుకోదూ, నే ఊరికే అన్నా, నాకు కోపంలేదు" ఏడుపు దిగమింగుకుని ఎలాగో అన్నాను.

చూస్తూ ఉండగా సూర్యుడు ఉదయించేస్తాడు, రెప్పపాటులో చీకటి మాయమైపోతుంది, అనంతకాలం పడుతుందనుకొన్నది ఒక్కక్షణంలో జరిగిపోతుంది. అలాగే చూస్తూ వుండగానే, రాజిగాణ్ణి ఎక్కించుకుని రిక్షా మలుపు తిరిగింది.

రాజీ వెళ్ళిపోయాడు నేనొక్కసారి కృంగిపోయాను, కళ్ళనీళ్ళు పెట్టుకు నిశ్శబ్దంగా కూలబడ్డాను. సూర్యాస్తమయమప్పుడు దిగంతాన కనబడే వర్షం మేఘం వెనుక ఉన్న అగ్ని జ్వాలలా జేవురించింది నాముఖం. ఆవేళ నా ఏడుపు స్వరం తప్పింది. ఆఏడుపు ఆపి వేయాలని ఎంతో ప్రయత్నించాను, కానీ, నేనే ఓడిపోయాను.

ఎదురుగుండా గోడకి కేలండరు నాకళ్ళబడింది. గుండే రాయయి పోయింది "ఇవాళ అమావాస్య" నానోరు ఎండిపోయింది. తెలివి తప్పిపోయినట్లుగా కదులూ మెదులూ లేకుండా అలాగే ఉండిపోయాను. నా ఒంట్లో ఉండేబలం అంతా పూర్తిగా పోయింది. కానీ, ఒక్కసారిగా నా బుర్రలో ఏదో ఊహ మెదిలింది. "ఇప్పుడెళ్ళి రాజిని వెనక్కు తీసుకొస్తే."

అంతలోనే ఏనుగంత బలం వచ్చింది. గబ గబా నాలుగడుగులు వేసాను. కనిపించిన రిక్షాలో ఎక్కికూచున్నా, వాడి చేతులో ఎంత పెట్టానో గుర్తులేదు.... రిక్షా దిగాను. బస్సు ఇప్పుడే వెళ్ళిపోయింది ఎవరిదో గొంతు వినిపించింది. శిలాప్రతిమలా అలాగే నిలబడి పోయాను. "గడ్డమావస్య" ఏదో సంకోచం నాలో మెదలుతూనే వుంది.

ఆకాశం మబ్బుల ముసుగు కప్పుకుంది. ఆకాశం చేసే హా హా కారాలకు ప్రకృతి యావత్తూ వణికిపోతోంది. అంతులేని నిరాశలా చీకటి ఆవరించుకు పోతోంది. ఎలాగో నిస్సత్తువగా ఇంటోకొచ్చి పడ్డాను

ఆ చీకట్లోంచి. రాత్రింతా నా రాజి నా కళ్ళ ముందే వున్నాడు.

* * *

తెల్లవారింది. పనిపాటలు చేస్తూనే వున్నాను. కానీ ఏదో పోగొట్టుకున్నట్లు నా హృదయం వెలితిగా అయిపోయింది. ఏదీ పగటికి వుండే లావణ్యమంతా ఏమయిపోయిందో అనిపించింది నాకు. ఎవరో తలుపు కొట్టారు రాజిగాడని పరుగెత్తాను తలుపు తీయటానికి. "రాజి బడికెళ్ళిపోయాడా" అన్నాడు భుజాన సంచీ తగిలించుకుని, వాడి క్లాసు పిల్లాడు" అ వెళ్ళిపోయాడు, అన్నా ఎటో చూస్తూ.

పిచ్చెత్తిన దానిలా అటూ ఇటూ తిరిగాను. ఏమీ తోచలేదు. బిలబిల్లాడుతూ బడిపిల్లలు పరుగెత్తుకొచ్చారు, కేరమ్సు ఆడుకుంటామంటూ వాళ్లందరినీ చూచేసరికి నా కళ్లు చెమర్చాయి. నా ఒళ్ళు మండిపోయింది "ఎన్నిసార్లు చెప్పాలి, రాజి ఊరు వెళ్ళిపోయాడని.... ఈ మాటు రండి నడ్డి విరగగొడతా" గట్టిగా వాళ్లమీద అరిచా. ఎవరో కుర్రాడి మాటలు వినిపించాయి "రాజి అమ్మమ్మ అంత కోపంగా ఉందేం ఈ రోజు"

తర్వాతనిపించింది నాకు, రాజి ఊరెళ్లాడని అదివరకు వాళ్లకి చెప్పకుండానే, వాళ్ల మీద ఎలా అరిచానో, పాపం, భయపడి పారిపోయారు!

రాజి వూరెళ్ళి వారం అవుతోంది. నిత్యకృత్యం యాంత్రికంగా జరిగిపోతోంది. సూర్యుడులేని పగలులాగ, చంద్రుడులేని రాత్రిలాగ, కళాకాంతులు లేకుండా నా యిల్లు శూన్యమయిపోయినట్లనిపించింది నాకు. రాజీ నేను కలసి భోంచేస్తాం, వాడు బడినుంచి వచ్చాక "అనుకుని రోజూ 11గం॥ దాకా కూర్చుంటున్నాను పదకొండు దాటాక నాకు గుర్తొస్తుంది రాజీ ఊళ్లోలేడని. నా కళ్ళు నీళ్లతో నిండుతుంటాయి. కొంచం కూడా అన్నం సయించదు. బడి గంట ఇంటికి వినిపించింది, "ఇంకా ఎంతసేపు పడుకుంటావ్ లే బెల్లు కొట్టారు"- నా పక్కలో పడుకున్న రాజిని లేపాలనుకుని గబగబా పక్కదగ్గర కొస్తాను. నా రాజిలేని పక్క నన్ను చూచి వెక్కిరించి నవ్వినట్లు, తెల్లని దుప్పటీ మెరుస్తూ కనపించింది నాకు రాజి మీది మమకారంతో కృంగికృశించి పోతున్నానని నేను గమనించకపోలేదు!-

మరి వాళ్లమ్మ వాడు కావాలనుకోదూ!

* * *

ఆరోజు ఆదివారం ప్రతి ఆదివారం రాజిగాడితో నాకు బలే కాలక్షేపం. "కేరమ్సు నేర్పుతా రావే అమ్మమ్మా" అంటాడు వాడు. "నువ్వొక్కడివీ ఆడుకో" అంటా నేను వాడు పకపకా నవ్వుతాడు. "నేనొక్కడినీ ఎలా ఆడుకుంటా" బుగ్గలు సొట్టలు పడుతూ బలె ముద్దుగా వుంటాడు నవ్వుతుంటే పదేళ్ళ రాజిగాడి ఆటలు, పాటలు, ముద్దు ముచ్చట్లు—అన్నీ నా కళ్ళకు కట్టాయి.

వీధి తలుపు దబదబా బాదారు. నాకు బలే కోపం వచ్చింది. "ఎన్నిసార్లు చెప్పాలో .... నే తలుపుతీయను. కొట్టి కొట్టి చేతులు నొప్పెట్టి వాళ్ళేపోతారు నాకేం" అనుకుని లేవకుండా అలాగే కూర్చున్నా. ఇంకా తలుపు బాదుతునే ఉన్నారు. నా ఒళ్ళుమండిపోయింది. చిన్నపిల్లలా ఎంతో ఉడుకుమోతుతనం వచ్చింది. నా గొంతు బొంగురుపోయింది. "రాజిగాడు ఈ ముసలి అమ్మమ్మని ఒదిలి ఊరెళ్ళిపోయాడు .... ఊరెళ్ళిపోయాడూ, ఎన్నిసార్లు చెప్పను" కోపంగా అరుస్తూ వెళ్ళి తలుపుతీసాను.

'నేనే అమ్మమ్మా' అన్నాడు రాజిగాడు నవ్వుతో. సూర్యాస్తమయమప్పుడు కనబడే సువర్ణరేఖలాగ ఒక్కసారి దర్శనమిచ్చాడు నా రాజి. నా కళ్ళు సంతోషంతో మెటిసిపోయాయి, "మా నాయనే, నా బంగారు తండ్రి, అమ్మమ్మదగ్గరకొచ్చేసావా" గట్టిగా బుగ్గలు కందిపోయేలా ముద్దుపెట్టుకుని, చెమర్చినకళ్ళు ఒత్తుకున్నాను.

'నీ మనుమణ్ణి నువ్వే వుంచుకో బాబూ.... వచ్చినరోజునుంచీ ఒకటే బెంగ నీకోసం... ఈ నల్లపిల్లాడు నాకొద్దులే' అంది నా పెద్ద కూతురు నవ్వుతూ.

'ఎవరైనా నవ్విపోగలరు, వాడు నలుపట, నీ కన్నా బాగున్నాడులే...కదూ రాజిగాడూ' ఆప్యాయంగా తల నిమురుతూ ఒళ్ళో కూర్చోపెట్టుకున్నాను. నిజంగా రాజిగాడు నలుపే, కానీ, వాడు నీలమేఘశ్యాముడే.

"నీ మమకారం అంది పెద్దమ్మాయి" కాఫీ చప్పరిస్తూ నీటిలో పూలతెప్పలాగ తేలిపోయింది నా మనసు. జాబిల్లి కిరణాలకు అలలు ఉప్పొంగిపోయినట్లు నా హృదయం పొంగిపోయింది ఆనందంతో. "మమకారమే మరి," దగ్గరగా తీసుకున్నా రాజిగాణ్ణి

—:0:—

## ప్రభూ!

నా యెడద యెండి
పగుళ్ళిచిన వేళ,
జాలి చినుకువై నీవు
నాపై చిలికి పొమ్మా.
నా జీవన మధా
కలశం వొలికిన వేళ,
గానామృతమై నీవు
పాత్ర నింపి పొమ్మా.
భీకర ప్రాపంచిక
దుఃఖాల సంకెళ్లు నన్ను!
బిగించనున్నవేళ, నా
వైపు సాగిరమ్మా.
నా దీన హృది, గది
మూలకుందు వేళ,
ప్రభూ నావద్ద కవు
పీఠమ్ము దిగిరమ్మా.
నా కోరికలు చంద్రికోలలై
నా యెడద బాధించువేళ,
నా మొరాలించి నీవు
నను పాలించరమ్మా

(రవీంద్రుని పాద చిహ్నాలలో
నా వ్యథాపదాలివి)

— "రంగబాబు"